# ఝార్ఖండ్ నాలుగు విప్లవ కమ్యూనిస్టు సంస్థల ఐక్యకార్యాచరణ

**మహత్తర** నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటు దేశంలో ఆనాడు సాగుతున్న ప్రజాఉద్యమాలపైనా, రాజకీయాలపైనా గొప్ప ప్రభావాన్ని పడవేసింది. విప్లవ సిద్ధాంతం, రాజకీయాలు దేశవ్యాపితంగా విస్తరించాయి. జెంషెడ్‌పూర్ కార్మికవర్గం, శ్రామిక ప్రజానీకంకూడా నక్సల్బరీ తిరుగుబాటుకి ప్రభావితమయ్యారు. అనేకమంది కార్మికులు, యువజనులు విప్లవకార్యాచరణలోకి దూకి వృత్తివిప్లవకారులుగా కృషిచేశారు. పోరాట క్రమంలో వీరిలో కొందరు అమరులయ్యారు. ప్రతి సంవత్సరం జులై 25న ఈ అమరులను స్మరించుకుంటూ జెంషెడ్‌పూర్‌లో ఒక స్మారకసభ నిర్వహిస్తున్నారు. అన్ని విప్లవ కమ్యూనిస్టు సంస్థలను, వ్యక్తులను, ప్రగతిశీలురను, ప్రజాస్వామికవాదులను సభ నిర్వాహకులు క్రమం తప్పకుండా ఈ సభకు ఆహ్వానిస్తున్నారు. 2017 జులై సభ సందర్భంగా ఒక కొత్తవిషయం జరిగింది. అమరుల స్మారకసభకు హాజరైన విప్లవ కమ్యూనిస్టు సంస్థలను ఈ సభకు హాజరైన వివిధ కమ్యూనిస్టు సంస్థల కార్యకర్తలు మరియు సానుభూతిపరులంతా–ప్రస్తుతం కార్మికులు, రైతులు, ఇతర శ్రామిక ప్రజలపై దాడులు పెరుగుతోన్న పరిస్థితుల్లో కలిసికట్టుగా జోక్యం చేసుకోవలసిందిగా కోరారు. సిపిఐ(ఎం–ఎల్), సిపిఐ(ఎం–ఎల్)పిసిసి, సిపిఐ(ఎం–ఎల్) రెడ్‌స్టార్, సిపిఐ(ఎం–ఎల్) ఎన్‌డి సంస్థల నాయకత్వాలు ఈ సభకు హాజరయ్యాయి. కనుక ఈ నాలుగు విప్లవ కమ్యూనిస్టు సంస్థల కార్యకర్తలు, రాష్ట్రనాయకులు విడిగా కలిసి కూర్చొని చర్చించుకోవాలని నిర్ణయించుకున్నారు. కొన్ని సమావేశాల తర్వాత, ఐక్య కార్యక్రమాలపట్ల ప్రతి ఒక్కరి అవగాహనను ఇతరులు అర్థంచేసుకున్నారు.

ఈ సంయుక్త సమావేశాల్లో దేశంలోనూ ప్రత్యేకించి ఝార్ఖండ్‌లోనూ నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితిని సవివరంగా చర్చించారు. ఝార్ఖండ్‌లో ఈ పరిస్థితుల్లో ఎలా జోక్యం చేసుకోవాలో కూడా చర్చించారు. అంతిమంగా, సామ్రాజ్యవాదులు, భారత కార్పొరేటుశక్తులు సాగిస్తున్న లూటీకి; రాజ్యనిర్బంధానికీ, మనువాద మతతత్వశక్తులకీ వ్యతిరేకంగా ఝార్ఖండ్ ప్రజానీకం ఐక్యంగా పోరాడాలనే పిలుపునివ్వాలని నిర్ణయించారు.

ఈ పిలుపుమేరకు, పై నాలుగు విప్లవకమ్యూనిస్టు సంస్థల ఆధ్వర్యంలో రాంచీ, దుంకా, బొకారో, పాలం, ఈస్ట్‌సింగ్‌భూమ్ జిల్లా కేంద్రాలలో సదస్సులు నిర్వహించారు. దీనితో సమన్వయ కార్యక్రమం మొదటిదశ దాదాపు ముగిసింది. ప్రస్తుతం రెండవదశ కార్యక్రమాన్ని చర్చించి, నిర్ణయించుకోవలసి వుంది. జిల్లాలలో జరిగిన ఈ సదస్సులలో–ప్రభుత్వ నిర్బంధాన్ని ఉపయోగించీ, ప్రజలను విభజించే మనువాద మతతత్వ ఎత్తుగడలనుపయోగించీ, ప్రస్తుత వ్యవస్థలో సాగిస్తున్న దోపిడీ గురించీ వక్తలు తమ ఉపన్యాసాలద్వారా వివరించారు.

పై సదస్సులన్నింటిలో ఈ క్రింది తీర్మానాలను ఆమోదించారు:

– యస్‌సి, యస్‌టి ప్రజలనుండి గుంజివేసుకొన్న భూములను వారికి తిరిగి ఇవ్వాలి.

– భూమిహీనులకు, పేదరైతులకు భూమిని పంపిణీచేసే భూసంస్కరణలను చేపట్టాలి.

– సిఎన్‌టి/ఎస్‌పిటి చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలి; మతస్వేచ్ఛను హరించే బిల్లును ఉపసంహరించాలి.

– యస్‌టి ప్రజానీకపు శరణ/జెహార్థన్ సంస్కృతికి మతస్మృతిని తేవాలి; 'పెసా' చట్టప్రకారం గ్రామసభలకే అన్ని అధికారాలు అప్పగించాలి.

– బహుళజాతి కంపెనీలకు, భారత కార్పొరేటు సంస్థలకు సేవ చేసేందుకు ఉద్దేశించిన 'భూబ్యాంకు' విధానాన్ని రద్దుచేయాలి.

– మనువాద మతతత్వశక్తులను వెల్లడిచేయాలి.

ooooo